

# అందమైన అబద్ధం

రాచపూటి రమేష్

డిప్యూటీ జైలర్ కృష్ణమోహన్ సివిల్ డ్రెస్‌లో సాయంత్రం ఏడు గంటలకు సబ్‌జైలు ఆవరణలో రౌండ్స్ వేస్తున్నారు. కృష్ణమోహన్ అక్కడ డ్యూటీలో చేరి నాలుగు రోజులే అయింది. రెండు రోజులపాటు చార్జి తీసుకోవడం, ఇంతకుమునుపక్కడ పనిచేసిన అధికారి తనకప్పగించిన ఫైళ్ళు, రికార్డులు సరి చూసుకోవడంతోనే సరిపోయింది. మూడవరోజు జిల్లా కేంద్రంలో అధికారులేర్పాటుచేసిన రివ్యూ మీటింగ్‌కు హాజరయ్యాడు. భార్య వినీతకు ఆరోగ్యం బాగులేకపోవ డంతో ఉదయం హాస్పిటల్‌కు చెకప్‌కు తీసుకెళ్ళి, మధ్యాహ్నం మూడింటికి తాను పనిచేస్తున్న సబ్‌జైలుకు చేరుకున్నాడు.

కృష్ణమోహన్ ఆదర్శ భావాలు గల యువకుడు. తన పరిధిలో ఖైదీలకు మానవతా దృక్పథంతో ఏదో ఒక సహాయం చేయాలన్న తాపత్రయం కల వాడు. 'నేరస్తులు చేసిన అకృత్యాలకు కఠిన శిక్ష ననుభవించే ప్రదేశం కాక, వారిలో పరివర్తన తీసుకువచ్చే దేవాలయం వంటిది ఖైదు అన్న' సూక్తిని నమ్మి నవాడు.

ఉదయమూ, మధ్యాహ్నమంతా ఖైదీలు ఎక్సర్‌సైజ్, యోగాభ్యాసం, తమ కప్పగించిన విధులతో బిజీగా వుంటారు. వారికి కాస్త తీరిక దొరికేది

సాయంత్రం ఆరు గంటల తరువాతే. ఆ సమయాన్ని వారెలా గడుపుతున్నారో పరిశీలించాలనుకున్నాడు కృష్ణమోహన్. కొత్తగా డ్యూటీలో చేరినందున అతని ముఖం ఎవరికీ పరిచయం లేదు.

ఒక సెల్లో నలుగురు ఖైదీలు పేకాడుతూ, బీడీలు కాలుస్తూ కాలక్షేపం చేస్తున్నారు. 'వీరికి పేక ముక్కలు, బీడీలు ఎలా వచ్చాయో' అని ఆశ్చర్యపోయాడు కృష్ణమోహన్. పహారా కాయవలసిన సిబ్బంది నిర్లక్ష్యం వల్లనో, లంచగొండితనం వల్లనో జైల్లోకి అన్‌వాంటెడ్ మెటీరియల్ చేరబడుతోంది. కృష్ణమోహన్‌ను ఎవరో ఖైదీకోసం వచ్చిన విజిటర్ అనో, మరోలా అనుకున్నారేమో వాళ్లసలు పట్టించుకోలేదు.

మరో చీకటి కొట్టులో ముగ్గురు సినిమా పత్రికలు, డిటెక్టివ్ నవలలు చదువుకుంటున్నారు. ఒకడు అభినయంతో ఏవో సినిమా డైలాగులు జోరుగా వల్లిస్తున్నాడు.

''మీ వూరికొస్తా, మీ పేటకొస్తా, మీ ఇంటికొస్తా, కత్తులతో కాదు, కంటి చూపుతోనే చంపేస్తా, నా చూపే పాశుపతాస్త్రం'' అని నానా హంగామా చేస్తున్నాడు. ఒకరిద్దరు ఆనందంతో చప్పట్లూ, విజిల్స్‌తో ఆ ఖైదీని ఎంకరేజ్ చేస్తున్నారు.

సినిమా పత్రికల మీద వున్న శ్రద్ధ వీరికి మంచి సాహిత్యం పట్ల లేకపోయిందే అని బాధపడుతూ కదిలాడు మోహన్. లైబ్రరీలో ఎన్నో మంచి పుస్తకాలున్నప్పటికీ అవి చదివే నాథుడే కరువయ్యాడు. ఖైదీలు ఎంతసేపు వార్తాపత్రికలు, సినిమా పుస్తకాలు తప్ప శరత్ సాహిత్యం, కొడవటిగంటి నవలలు వంటి పుస్తకాల జోలికి పోవడం లేదు.

టీవీ రూంలో ఇరవైమంది దాకా ఖైదీలు కూర్చుని సినిమా పాటలను ఉత్సాహంగా చూస్తున్నారు. మరికొందరు జర్దాపాన్‌లను నములుతూ పిచ్చాపాటి కబుర్లలో మునిగి తేలుతున్నారు.

కృష్ణమోహన్ తన ఛాంబర్లో కూర్చుని, వార్డెన్ని పిలిచి ఈ దుస్థితికి కారణం అడిగాడు.

''సార్, మనకున్న స్టాఫ్ తక్కువ. పగలూ, రాత్రి ఒకరినే డ్యూటీ చేయమనడం సబబు కాదు. సూపర్‌విజన్ సరిగా లేదు. పైగా ఎన్నిసార్లు చెప్పినా ఖైదీలు తమ పంథా మార్చుకోవడం లేదు. ఏం చెయ్యమంటారు'' అని వాపోయాడు వార్డెన్.


ఇంటికి చేరిన కృష్ణమోహన్ భోజనం చేసి ఆలోచనలో మునిగిపోయాడు. భర్త పరాకును గమనించకుండా వినీత తన ధోరణిలో ఏదో చెప్పుకుపోతోంది.

''ఏమండీ, నాకీ వూళ్లో ఏమీ తోచడం లేదు. ఎంతసేపని ఇరుగుపొరుగు ఇల్లాళ్ళతో కబుర్లాడను? టీచరుగానైనా ఏదో ప్రయివేట్ స్కూల్లో చేరదామంటే మన ఇంటికి దగ్గర్లో ఏ స్కూలూ లేదు. ఉన్నా, వారిచ్చే రెండు వేలకు బండచాకిరీ చేయిస్తారు. ఏ చేయాలో తోచడంలేదు'' అని వాపోతోంది.

కృష్ణమోహన్‌కు మెరుపులాంటి ఆలోచన వచ్చింది. ''ఎం.ఏ., బియిడి'' చేసి భార్య ఇంటి దగ్గర ఖాళీగానే వుంది. 'ఖైదీల్లో అక్షరజ్ఞానం వున్నవారితో ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ పరీక్షలకు ఎంట్రన్స్ రాయిస్తే?' వారికి కావలసిన నోట్సులవీ తయారుచేయమని వినీతనే పురమాయించవచ్చు. ఏదో ఒక వ్యాపకంలో పడితే ఖైదీలు పోచుకోలు కబుర్లు, వృథాప్రయాసల జోలికి పోరు. ఏదో ఒక డిగ్రీ జైల్లో వుండే సంపాదిస్తే భావి జీవితంలో వారికది ఉపయోగపడవచ్చు. భార్యకు కూడా ఏదో ఒక మంచి వ్యాపకాన్ని కల్పించినవాడవుతాడు.

వినీతతో తనకు తోచిన ఆలోచన గురించి చెప్పాడు మోహన్. సులభ రీతిలో ఖైదీలకు వివిధ పాఠ్యాంశాల్లో నోట్సులు తయారుచేసి ఇచ్చేందుకు ఆమె ఉత్సాహంగా ఒప్పుకొంది. చిన్ననాటినుంచీ ఆమె తండ్రి పద్ధతిలో పరోపకార ధోరణి, సేవాభావం అలవరచుకున్న వ్యక్తి.

మరుసటిరోజు కృష్ణమోహన్ జైల్లో ఒక సమావేశం ఏర్పాటుచేసి ఖైదీలకు తన ప్రణాళిక గురించి వివరించాడు. కారాగారవాసుల్లో డెబ్బై శాతం ఎంతోకొంత అక్షరజ్ఞానం వున్నవారే. అయినా చాలామంది ఆ ప్రపోజల్ విని పెదవి విరిచారు. కొందరు మాత్రం ఉత్సాహంగా ఆ ప్రతిపాదనకు అంగీకరించారు.




''ఎప్పుడో ఎనిమిది, పదో తరగతుల్లో చదువుకు స్వస్తి చెప్పాం. ఇప్పుడు పుస్తకాలు పట్టుకోమంటే మావల్ల కాదు. ఎందుకు సార్, మీకు అనవసరమైన శ్రమ'' అన్నాడు కోరమీసాలతో వున్న చలమయ్య అనే బలాఢ్యుడు.

''మా ఆయన్ను ఆస్తికోసం వాళ్ల తమ్ముడే హత్య చేసి అన్యాయంగా నన్ను కేసులో ఇరికించారు. లాయర్లు, మీ పోలీసులు లంచాలకాశపడి నన్ను జైలుపాలు చేశారు. నా చదువూ, జీవితమే వ్యర్థమయింది'' ఇంటర్మీడియట్ పాసైన ఒక విద్యావంతురాలు రోదిస్తూ వాపోతోంది.

'ఎంతసేపు వేదనలు, రోదనలతో గడిపే ఆమె డిప్రెషన్‌కు చదువే మంచి మందు సార్' అని మోహన్ చెవిలో గొణిగాడు వార్డెన్.

'నిజమే, ఏదో ఒక వ్యాపకంలో పడితేగాని ఆమె ఈ వేదన నుంచి కోలుకోలేదు' అనుకున్నాడు కృష్ణమోహన్.

కృష్ణమోహన్ గొంతు సవరించుకున్నాడు. ''ఇందులో ఎవరి బలవంతమూ లేదు. చేసిన నేరాలకు కొందరూ, చేయని నేరాలకు కొందరు జైలుపాలయ్యామంటున్నారు. నిజానికి ఏ మనిషీ కావాలనే నేరాలు చేయడు. పేదరికము, కుటుంబ పరిస్థితులు అతణ్ణి నేరాలకు ప్రోత్సహిస్తాయి. అయినా మీరు ఎల్లకాలం జైల్లోనే వుండరు. మీరు విశాల ప్రపంచంలోకి మళ్లీ అడుగుపెట్టిన రోజు మీ చదువుగానీ, ఈ డిగ్రీలు గానీ మీకు ఉపకరించగలవు. మీ దృక్పథం మారేందుకు, అవగాహన పెరిగేందుకు, సమస్యలు, లావాదేవీలు పరిష్కరించేందుకు చదువు మీకు ఉపయోగపడుతుంది'' అని ఎన్నో ఉదాహరణలతో వారి మనసు మార్చడానికి ప్రయత్నించాడు. చివరికి ముప్పైమంది ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ కోసం ప్రవేశపరీక్ష రాయడానికి సన్నద్ధులయ్యారు.

''మీ ఫీజులవీ పై అధికారులతో సంప్రదించి మా శాఖవారే కట్టే ఏర్పాట్లు చేస్తాను'' అని హర్షధ్వానాల మధ్య ప్రకటించాడు కృష్ణమోహన్.

యూనివర్సిటీ అధికారులతో సంప్రదించాడు మోహన్. ''జైల్లో పరీక్షలు నిర్వహించలేం. మీరు ఏదో ఒక కాలేజీలో పరీక్షలు రాయించాల్సిందే. అలాగే పరీక్షలు కూడా చాలా స్ట్రిక్టుగా నిర్వహిస్తాం. కాపీల వంటి వాటికెంతమాత్రం ఆస్కారం వుండదు. ఆలోచించుకోండి'' అన్నారు వారు.

''ఆ సంగతి నా కొదిలేయండి. స్వంత ప్రతిభతోనే పరీక్షలు రాస్తారు మావాళ్లు'' అన్నాడు కృష్ణమోహన్, నవ్వుతూ.


ప్రయాసపడి ఖైదీలను చదువుకొనేందుకు ఒప్పించినా, తన పైఅధికారుల వద్ద అంత ప్రోత్సాహం లభించలేదు కృష్ణమోహన్‌కు.

''ఎందుకు బ్రదర్, అనవసరమైన లంపటాలను నెత్తికెత్తుకుంటావు. పరీక్ష జరిగినన్ని నాళ్ళూ ఖైదీలను జాగ్రత్తగా వ్యాన్లో పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లాలి. దారిలోనూ, ఆ సెంటర్‌లోనూ ఎవ్వరూ

తప్పించుకోకుండా వెయ్యి కళ్లతో కాపలా కాయాలి. ఎవరైనా నీ కన్నుగప్పి పరారయ్యారో, అసలుకే మోసం వస్తుంది. నీ ఉద్యోగానికే ముప్పు వాటిల్లుతుంది. అనుభవంతో చెప్తున్నా, ఆలోచించుకో'' అన్నాడు ఒక అధికారి. మిగిలినవారు కూడా అదే పంథాలో మాట్లాడారు.

కృష్ణమోహన్ తన పట్టు వీడలేదు. చివరికి అధికారులు కృష్ణమోహన్ ఖైదీల తరపున చేసిన అభ్యర్థనను ఆమోదించారు. పరీక్షల ఫీజు, యూనివర్సిటీ ఫీజు కూడా మానవతా దృక్పథంతో ప్రభుత్వం భరించేలా ఒప్పించగలిగాడు మోహన్.

ఎంట్రన్స్ పరీక్షల్లో ఆశ్చర్యకరంగా ముప్పైకి ఇరవై నాలుగుమంది సెలెక్టయ్యారు. రెట్టించిన ఉత్సాహంతో పాఠ్యపుస్తకాలు, వినీత తయారుచేసిన నోట్స్ చదవసాగారు ఖైదీలు. ఇప్పుడు వారిలో తెలియని ఉత్సాహమేదో గోచరిస్తోంది.




మిగతా ఖైదీల ప్రవర్తనలో కూడా మార్పు వచ్చింది. పేకాటలూ, పిచ్చాపాటి కబుర్లు చాలావరకు తగ్గాయి. జైల్లోని గ్రంథాలయానికి పాఠకులు అధికసంఖ్యలో హాజరవుతున్నారు. చాలా పుస్తకాల దుమ్ము దులపబడింది. సెల్లో సినిమా పత్రికల బదులు పత్రికలు, నవలలు చాలావరకు చదువబడుతున్నాయి. ఆ పుస్తకాల్లోని విషయాల గురించి చర్చలు సాగుతున్నాయి. అప్పుడప్పుడూ కృష్ణమోహన్ ఖైదీలకు ఆటల పోటీలు, డిబేట్ల వంటివి పెట్టి చిన్నపాటి ప్రైజులందజేస్తూ వచ్చాడు.

చూస్తుండగానే ఫస్టియర్ పరీక్షలు ముంచుకొచ్చాయి. తీరికవేళల్లో అభ్యర్థులంతా బాగానే ప్రిపేరవుతున్నారు. అప్పుడప్పుడు కొందరు లెక్చరర్లతో కృష్ణమోహన్ వారికి ప్రత్యేకంగా సందేహ నివృత్తి చేయిస్తున్నాడు.

మొదటి పరీక్షకు ఖైదీలను సివిల్ డ్రస్‌లో వేన్లో ప్రత్యేక భద్రతతో తీసుకెళ్లాడు కృష్ణమోహన్. ఖైదీలు ఎగ్జామ్ సెంటర్‌లోని గదిలో ప్రవేశించి పరీక్ష రాయడం మొదలెట్టారు. బయట తన స్టాఫ్‌తో బాటూ పహారాకాస్తున్నాడు కృష్ణమోహన్. అరగంట తరువాత బయటకొచ్చిన ఒక ఇన్విజిలేటర్ దగ్గర ప్రశ్నాపత్రాన్ని తీసుకొని చూశాడు. అతనికి షాక్ తిన్నట్లయింది. ఊహించనంత కష్టంగా వుందా క్వశ్చన్ పేపర్.

'ఎప్పుడో నాలుగైదేళ్లకొకసారి ఇలాంటి కఠినమైన పేపర్లు సెట్ చేస్తారు సార్ ఎవరో మైండ్‌లెస్ పర్సన్' అంటున్నాడు ఇన్విజిలేటర్.

మూడు గంటల తరువాత ఖైదీలు మొఖం వేలాడేసుకుని బయటకు వచ్చారు. చూస్తుండగానే వారెవ్వరూ పరీక్ష బాగా రాయలేదన్న సంగతి బోధపడింది కృష్ణమోహన్‌కు.

జైలుకు చేరుకున్న తరువాత ఖైదీలు ఒక గ్రూపుగా కలుసుకున్నారు కృష్ణమోహన్‌ను అతని ఛాంబర్‌లో. వారి ముఖాల్లో నిరుత్సాహం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

''సార్, మీరు మా మీద దయతో ఈ పరీక్షలకు కట్టించారు మమ్మల్ని. కానీ మాలో మీరనుకున్నంత టాలెంట్ లేదు. ఈ డిగ్రీలు, పరీక్షలూ మా ఒంటికి పడవు. దయచేసి మమ్మల్ని వదిలెయ్యండి. మిగతా పరీక్షలకు మమ్మల్ని తీసుకెళ్లడం దండగే'' అన్నారు వాళ్లు. కృష్ణమోహన్ వారికెంత నచ్చచెప్పబోయినా లాభం లేకపోయింది. కాసేపు తల పంకించి ఆలోచిస్తూ వుండిపోయాడు మోహన్. చివరకు చిన్నగా వంగి రహస్యం చెప్తున్నట్లు చెప్పాడు.

''ఇందులో మీకు తెలియని విషయం ఒకటుంది. ఈ పనంతా నేను మీకోసం మాత్రమే చేయడం లేదు. మీలో సగంమంది డిగ్రీ తెచ్చుకున్నా నాకు రెండు ఇంక్రిమెంట్లు వస్తాయి. జీతం నెలకు పదిహేను వందల దాకా పెరుగుతుంది. అంటే ఏడాదికి పద్దెనిమిది వేల దాకా అన్నమాట! నాకు తెలిసిన లెక్చరరొకరున్నారు. పదివేలు పడేస్తే మిమ్మల్ని గుట్టుచప్పుడు కాకుండా ఈ పేపర్లో పాస్ చేయిస్తాడు. ఆ విషయం నాకొదిలేయండి. మిగతా పేపర్లకు నిశ్చింతగా ప్రిపేర్‌కండి'' అన్నాడు.

ఖైదీల ముఖాల్లో అనిర్వచనీయమైన మార్పు వచ్చింది. డబ్బుకు లోకం దాసోహం, ఈ జైలరు కూడా అందరిలాంటివాడే' అనుకుంటూ వెళ్లిపోయారు. మామూలుగానే చదివి మిగతా పరీక్షలకు హాజరయ్యారు.

రెండు నెలల తరువాత రిజల్ట్స్ వచ్చాయి. ఖైదీల్లో ఇరవైరెండు మంది ఆఖరి మూడు పరీక్షల్లో పాసయ్యారు. మొదటి పేపరు తప్పారు. ఒక పేపరు ఫెయిలయ్యామనే బాధకన్నా మూడు సబ్జెక్టులలో పాసయ్యామనే ఆనందం కనిపిస్తోంది వారిలో. కృష్ణమోహన్‌ను కలుసుకున్నారు ఆనందంగా.

'రెండు నెలల్లో సప్లిమెంటరీ ఎగ్జామ్ వుంది. కష్టపడి చదవండి' అన్నాడు కృష్ణమోహన్. అతనన్నట్లుగా అందరూ ఆ ఒక్క పేపర్ మళ్లీ రాసి పాసయ్యారు.

చిన్న ఫంక్షనేర్పాటుచేసి పాసైన ఖైదీలకు మిఠాయిలు, బహుమతులను అందజేశాడు కృష్ణమోహన్. మాటల సందర్భంలో చెప్పాడు.

''నా హితబోధ విని మీరంతా డిగ్రీ పరీక్షలకు కట్టి, చాలా గాప్ చదువులో వచ్చినా, కష్టపడి చదివారు. మొదటి పేపరు కష్టంగా వచ్చిందని, అసలు పరీక్షలు రాయడమే మానేయాలనుకున్నారు. ఒకసారి ఆశాభంగం చెందితే, మళ్లీ మిమ్మల్ని పరీక్షలకు సన్నద్ధం చేయడం కష్టమౌతుంది. నాలుగు పేపర్లూ మళ్లీ రాయడం కష్టమౌతుంది మీకు. అందుకే నేనొక చిన్న నాటకం ఆడాను.

ఎవరో లెక్చరర్ డబ్బుకాశించి మార్కులు వేయించి పాస్ చేస్తాడన్నదీ, మీరు పాసైతే నాకు ఇంక్రిమెంట్ వస్తుందన్నదీ అన్నీ అబద్ధాలే. మీ మేలుకోరి, మిగిలిన పరీక్షలు మీతో తప్పనిసరిగా రాయించాలన్న ఉద్దేశంతో చెప్పానలా. అలా చెప్పినందుకు క్షమించండి నన్ను.''

కృష్ణమోహన్ మాటలు విని అవాక్కయ్యారు ఖైదీలంతా. చివరకు ముందుగా తేరుకున్న చలమయ్య లేచి చెప్పాడు.

''సార్, మీరు అబద్ధం చెబితే చెప్పారుగానీ అందమైన అబద్ధమది. మీ చలవ వల్ల మేము ఫస్టియర్ పాసై ఉత్సాహమూ, ఆత్మవిశ్వాసం పోగుచేసుకున్నాం. ఈ వూపుతోనే మిగిలిన రెండు సంవత్సరాల పరీక్షలు ఆడుతూ పాడుతూ పాసై, డిగ్రీ తెచ్చుకోగలం'' అన్నాడు.

మిగిలిన ఖైదీలు, చలయ్యకు వంతపాడుతూ, తమను పనికిమాలిన వ్యాపకాల నుంచీ మళ్లించి, ఒక స్థిరలక్ష్యం ఏర్పాటుచేసుకునేలా చేసిన కృష్ణమోహన్‌ను, సులభరీతిలో తమకు పాఠాలు అర్థమయ్యేలా నోట్సులు తయారుచేసి సహకరించిన వినీత మేడమ్‌ను వేనోళ్లా పొగడసాగారు.

కరకు రాతి గోడల మధ్య బీటలువారిన నేలలో ఖాకీవనంలో పూసిన విద్యాసుమాలను ఆప్యాయతతో చూసుకున్నాడు కృష్ణమోహన్.

★